# మీలోనున్న సత్య, ధర్మములను మీరు కాపాడుకోండి!

గ్రామసేవయన్న రామసేవయె సుమా
రామరాజ్యమన్న ప్రేమ మయమె
ప్రేమ లేక జగతిని ఉద్ధరించుట కాదు
కాన సేవ చేసి బాగుపడుడు.

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా!

మానవుని ఉత్తేజపరచునది, ఉత్సాహమునందించునది గ్రామసేవయే! పల్లెలు, పట్టణములలోని అంతర్భాగములు. ఇట్టి అంతర్భాగమైన పల్లెలు సుక్షేమంగా ఉన్నప్పుడు పట్టణములుకూడా సుక్షేమంగా ఉంటాయి. పూవులేక కాయపుట్టదు చెట్టున, కాయలేక ఫలము కలుగబోదు. పల్లెలులేక పట్టణములుకావు. ఈనాడు మన భారతదేశములో దక్షిణాదిలో మద్రాసు మహాపట్టణము అనుకుంటున్నాం. కాని ఇది పూర్వము ఒక పల్లెయే! 'చెన్నప్ప పల్లె' అని దీనిపేరు. క్రమక్రమేణా అది గొప్ప పట్టణముగా ఏర్పడిపోయింది. అదే విధముగా బెంగుళూరుకూడా చాలా చిన్న పల్లె. దీనిపేరు బెలగాళ్. అనగా ఇక్కడి వారు వేచిన శనగకాయలు అమ్ముకొని బ్రతికేవారు. క్రమక్రమేణా బెంగుళూరు అయిపోయింది. అంతవరకు మనం పోనక్కరలేదు. మన పుట్టపర్తి ఒక కుగ్రామము. కేవలము రెండు వందలమంది ప్రజలు మాత్రమే ఉండేవారు. ఈనాడు ఈ పల్లె గొప్ప పట్టణముగా మారి ప్రపంచమ్యాప్‌లో ఒక ప్రత్యేక పట్టణముగా నిరూపిస్తూ వచ్చారు.

**పల్లెలయందున్న నీతినిజాయితీలు పట్టణములందు కానరావు**

ఈ విధముగా వ్యక్తిత్వముకూడా పరిణామముచేతనే దివ్యత్వముగా మారిపోతుంది.

srisathyasaivachanamrutam

కాలకర్మకారణ కర్తవ్యములు కుదిరినప్పుడు మన ప్రతిష్ఠకూడా అభివృద్ధి అవుతుంది. వ్యక్తిగా బ్రతకవలసిన మానవుడు మానవత్వమును దృష్టిలో నుంచుకొని ప్రవర్తించినప్పుడు తాను గొప్ప మానవుడుగా మారిపోతాడు. ఆధునికయుగమందు కలిప్రభావముచేత మానవుడు తనలోనున్న మానవత్వమును గుర్తించుకోలేకపోతున్నాడు. మానవునియందున్న మానవత్వమునే గుర్తించుకోలేని మానవుడు మానవునియందున్న దైవత్వము ఏవిధంగా గుర్తిస్తాడు? కనుక, మొట్టమొదట మానవుడు తన మానవత్వమును గుర్తించాలి. ఈ మానవత్వములోని వ్యక్తిత్వము చక్కగా అర్థము చేసుకోవాలి. ఈ వ్యక్తిత్వముద్వారానే శివత్వము మనలో ఆరంభమవుతుంది. ప్రతి మానవుడు పల్లె అనగా ఒక హాస్యాస్పదముగా భావించరాదు. ఆ పల్లెలే గొప్ప పట్టణముగా మారవచ్చు. ఈనాటియందుకూడా పల్లెలలోనున్న భారతీయసంస్కృతి పట్టణములలో కనిపించటంలేదు. కనుక పల్లెలలో ప్రారంభించినదే భారతీయసంస్కృతి. ఈ సంస్కృతియొక్క ప్రభావమే భారతదేశమునకు అనంతమైన కీర్తి సంపాయించింది. పల్లెలయందున్న నీతినిజాయతీలు పట్టణములందు లేవు. పల్లెలందున్న అన్యోన్యత, ఐకమత్యము ఎక్కడకూడ పట్టణములందు కానరావు.

**మానవుని మనస్సును పరిశుద్ధము గావించునది, బుద్ధిని వికసింపజేయునది నిష్కామకర్మయే!**

భారతీయసంస్కృతి, నీతినిజాయతీలకు పల్లెలే పునాదులు. పల్లెలే పుట్టినిల్లు. ఇట్టి పుట్టినిల్లు మనము మరచినప్పుడు యింక ఏ విధమైన జీవితము గడుపుతాము? ప్రతి మానవుడు గ్రామములను అమితంగా ప్రేమించాలి. గ్రామములలో మనం ప్రవేశించి సేవలు చేయాలి. ఈ సేవలయందుకూడా ముందుగా గ్రామప్రజలకు భజనలు నేర్పించాలి. పల్లె ప్రజలకు భజనలంటే యిష్టము. అందరూ ఒకనాడు సాయంకాలము ఒక దేవాలయములో భజనచేసి సామూహిక భజనలోపల ఐక్యతను పెంచుకోవచ్చును. తదుపరి ఈ పల్లెలను పరిశుద్ధము చేయటానికి పూనుకోవాలి. ఈ విధమైన పారిశుద్ధ్యముచేత వారికి ఆరోగ్యము పెరుగుతుంది. భజనలచేత ఆనందము, పారిశుద్ధ్యముచేత ఆరోగ్యము. ఆనంద, ఆరోగ్యముల ఉత్సాహప్రోత్సాహములే మానవుని అభివృద్ధికి మూలకారణము.

sri sathyasai vahinamrutam

యువకులైన మీరు పల్లెలను ప్రధానంగా తీసుకొని పల్లెల్లో సేవ చేయాలి. మానవుని మనస్సు పరిశుద్ధము గావించునది, బుద్ధిని వికసింపచేయునది, యీ నిష్కామకర్మయే! సేవలతోబాటు కొన్ని సద్గుణములుకూడా మనం పెంచుకోవాలి. సహనము, సానుభూతి, త్యాగము, ప్రేమ, ఔదార్యము యిత్యాది పవిత్ర గుణములను మనం అభివృద్ధిపరచుకోవాలి. పల్లెలవారితో మనం మాట్లాడునప్పుడు మన మాటలు ప్రేమమయంగా ఉండాలి. పల్లెలవారితో పాలలో నీరు కలిసినట్లుగా కలసిపోవాలి. మనము వారితో కలసిమెలసి ఉండినప్పుడే వారు మనతో కలసిమెలసి ఉండి మన సద్భావములు వారికి అందించటానికి చక్కని అవకాశము ఏర్పడుతుంది. పల్లె సేవలన్నీ పవిత్రమైన సేవలే! కనుక, భగవంతుని మనము ప్రేమించాలంటే the best way to Love God is to love all and serve all. వారిని మనము ప్రేమించినప్పుడే సేవలు ప్రేమమయంగా మారిపోతాయి.

**త్యాగభావముచేత అహంకారము సన్నగిల్లుతుంది**

సేవలయందున్న మహత్తరశక్తి మరి ఏ ఇతర సాధనలయందు కనిపించదు.

**న తపాంసి న తీర్థాని న శాస్త్రాణి జపా నహి**
**సంసార సాగరోద్ధారే సజ్జన సేవనం వినా**

ఎంత ఘోరమైన తపస్సాచరించినా, శాస్త్రములు పఠించినప్పటికిని, ఎన్ని యజ్ఞయాగాదిక్రతువులు ఆచరించినప్పటికిని సేవకు మించిన ఫలితము ఎందులోను కానరాదు. సేవయందు మహత్తరమైనశక్తి యిమిడి ఉంటున్నాది. ప్రేమలో హృదయమును అర్పితము గావించే త్యాగభావము ఉంటున్నది. త్యాగభావముచేత మానవునియందు నఖశిఖపర్యంతము సంచరించే అహంకారభావము సన్నగిల్లుతుంది. ఈనాటి మానవుడు అహంకారమయుం కావటంచేత ప్రేమరహితుడైపోతున్నాడు. ఈనాడు విద్యలు కేవలము ఆడంబరమైన విద్యలు. కేవలము అసహ్యమైన విద్యలుగా రూపొందుతున్నాయి.

**నేటి విద్య తెలివితేటలనే పెంచు**
**కొంచెమైన గుణము పెంచబోదు**
**కోటివిద్యలుండి గుణము లేకున్నచో**

sri sathyasaivachanamrutam

### ఫలమదేమి వాని విలువదేమి?

ఎంత గొప్ప విద్యావంతుడైనా గుణమే లేక వానికి పేరు లేదు, ప్రతిష్ఠలేదు. సమస్త విద్యలందు గుణము చాలా ప్రధానమైనది. కానీ యీనాటి విద్యార్థులకు అధ్యాపకులు తెలివితేటలనే పెంచుతున్నారుగానీ, గుణములు పోషించుటకు తగిన కృషి చేయటంలేదు. పవిత్రమైన ప్రాచీన గుణములను మనం పెంచుకోవాలంటే పల్లెలందు ప్రవేశించాలి. యింతో అంతో భారతీయసంస్కృతి మిగిలి ఉన్నాదంటే పల్లెలందే ఉన్నది. అట్టి పవిత్రమైన పల్లెలలో మనం ప్రవేశించి ఉన్నతమైన ఆదర్శమునందించే జీవితాన్ని అనుభవించాలి.

### ప్రపంచములో అందరూ సేవకులే!

సేవ అనగా ఏమిటో అర్థం చేసుకోవాలి. ప్రపంచములో రాజుమొదలుకొని రైతువరకు సేవకులే! కూటిపేదమొదలు కోటీశ్వరునివరకు అంతా సేవకులే! తండ్రికి తల్లి సేవకురాలు. తల్లికి తండ్రి సేవకుడు. భార్యకు భర్త సేవకుడు. భర్తకు భార్య సేవకురాలు. తల్లికి బిడ్డ సేవకుడు. బిడ్డకు తల్లి సేవకురాలు. అధ్యాపకుడు విద్యార్థికి సేవకుడు. విద్యార్థికి అధ్యాపకుడు సేవకుడు. ఈ విధంగా ఒకరికొకరు సేవాభావముతో మెలగకపోతే యీ జగత్తులో మనం కలసిమెలసి మెలగలేము. విద్యను బోధించే సమయంలో గురువు విద్యార్థికి సేవకుడే. సేవకాభావము చాలా విలువైనది. నేను ధనవంతుడను, బలవంతుడను, గుణవంతుడను, శ్రీమంతుడను అని అనుకున్నంతమాత్రమున తాను మాష్టరు కాదు. దీనికి మన దేహములోని అంగములే సరైన సాక్ష్యము. మనము దృశ్యమును చూడకుండా ఉన్నప్పుడు దృశ్యముయొక్క రూపమే తెలియదు. చూచేది కన్నులు. విషయమే వినకుండిన మనకు ఏమి తెలుస్తుంది? మాటలే లేకుండిన మనస్సుయొక్క మర్మమునే మనం గుర్తించుకోలేము. నాలుక మాట్లాడుతున్నాది. కన్నులు చూస్తున్నాయి. చెవులు వింటున్నాయి, చేతులు పని చేస్తున్నాయి. ఇవన్నీ సర్వెంట్సే! అనగా యింద్రియములన్ని సర్వెంట్సే! దీనికి మాష్టరు మనస్సు. ఎంతవరకు? మాష్టరుకూడా యింద్రియములపై ఆధారపడి ఉంటున్నాడు. యింద్రియములు సరైన బోధలు చేయకపోతే మనస్సుకూడా సర్వెంటు అయిపోతాడు. జగత్తులో సర్వ ప్రాణులు సర్వెంట్సుతో సమానమే! బాల్యములో

srisathyasaivachanamrutam

విద్య నేర్చుకునే సమయంలో ఒక బీదవాడు, ఒక శ్రీమంతుడు ఒక స్కూలులో చదువుతుండేవారు. కొంతకాలము గడచిన తరువాత శ్రీమంతుడు రాజయ్యాడు. బాల్యస్నేహముచేత రాజును చూడాలని బీదవాడు బయలుదేరాడు. ఆహారవిహారములు సరిగా లేకపోవటంవలన దేహము బలహీనమైపోయింది. రాజు పౌష్టికాహారము తింటూ సంతుష్టిగా ఉన్నాడు. కానీ యీ బీదవాడు కఱ్ఱ పట్టుకొని వణుకుతూ రాజుని చూడటానికి వెళ్లాడు. అతను మాటల సందర్భములో 'స్వామీ! ప్రపంచములో అందరు సేవకులే! నేను సేవచేసి బ్రతుకున్నాను', అన్నాడు. 'మిత్రుడా! నేనుకూడా సేవకుడనేనా?' అడిగాడు రాజు. 'నీవే కాదు, నీ తాత ముత్తాతలందరూ సేవకులే!' అన్నాడు. అప్పుడు రాజు 'నాకు కావలసినంతమంది సేవకులుంటున్నారు. నేను రాజును, నేను సేవకుడను కాద'న్నాడు. 'అది నీ భ్రమ' అన్నాడు. రాజుయందు తనకు గల స్వాతంత్రముచేత 'సరే అదే ప్రత్యక్షంగా నిరూపింపచేయాల'ని యీ మిత్రుడు సంకల్పించుకున్నాడు. 'నేను వెళ్లి వస్తాను' అని నమస్కారము చేసి తన చేతిలో నున్న కఱ్ఱను క్రింద జారవిడిచాడు. అది తీసుకుందామని తాను ముందుకు వంగలేదు. స్నేహభావముచేత రాజే వంగి ఈ కఱ్ఱను అందించాడు. అప్పుడు 'రాజా! యిప్పుడు నా కఱ్ఱ క్రింద పడినప్పుడు అందించావు. సేవకుడు నీవా, నేనా? ఏ సమయము, ఏ సందర్భము, ఏ కాలము ఎప్పుడు ఎక్కడ ఎట్లా ప్రాప్తిస్తుందో తెలియదు. నీవుకూడా సేవ చేయవలసి వస్తుంది. ప్రేమపూర్వకంగా అనుకోవచ్చును, నాపైననున్న గౌరవముతో అనుకోవచ్చును, ఎట్లైతేనేమి నీవు నడుమువంచి నాకు కఱ్ఱను అందించావు' అని చెప్పాడు.

### మానవునియందున్న దివ్యశక్తి ఇంతింతని చెప్ప వీలుకానిది

ప్రతి మానవుడు భగవంతుని ప్రతిరూపమే! జగత్తులో అనేక కోట్లమంది జనము ఉంటున్నారు. ఇన్ని కోట్లమంది జనములో అనేకమంది అనేక భావములతో మెలగుతున్నారు. అయితే మానవజన్మ ఉత్కృష్టమని చెప్పటానికి యిందులో విశేషము ఏమిటి? 'జంతూనాం నరజన్మ దుర్లభం'. ఈ దుర్లభమునకు ఏది మూలకారణం? భగవద్గీత చెప్పింది. 'మమైవాంశో జీవలోకే'. అన్ని జీవులందు ఉండినది నేనే! నాయందున్న ఆత్మ,

sri sathyasai vahamrutam

ప్రతి మానవునియందున్న ఆత్మ, ప్రతి ప్రాణియందున్న ఆత్మ ఒక్కటే! అన్నాడు. అట్టి సత్యమును గుర్తించుకునే వ్యక్తిత్వము ప్రతి మానవునియందు ఉంటున్నది. అంతేకాదు. మరొక కారణముంటున్నది. మానవ దేహమునకు పంచకోశములుంటున్నాయి. అన్నమయకోశము, ప్రాణమయకోశము, మనోమయకోశము, విజ్ఞానమయ కోశము, ఆనందమయకోశము. అయితే నాల్గవదైన విజ్ఞానమయకోశము ఒక్క మానవునికి మాత్రమే తెలుసు కానీ పశుపక్షి మృగాదులకు తెలియదు. కనుకనే మానవుడు యింత పెద్ద విజ్ఞానిగా మేధావిగా తయారౌతూ వచ్చాడు. ఇట్టి సత్యమును గుర్తించుకునే వ్యక్తిత్వము మానవునియందు ఉంటున్నది. ఏది మంచి, ఏది చెడ్డ; ఏది చేయతగినది, ఏది చేయతగనిది అనే విచక్షణాశక్తి ఒక్క మనిషికి మాత్రమే ఉంటున్నాది. ఇది స్వార్థము, యిది పరార్థము అని ప్రత్యక్షముగా నిరూపించేశక్తి మానవునికి ఉంటున్నది. ఈ విధంగా మనం పరిశీలన చేస్తూపోతే మానవునియందున్న దివ్యశక్తి యింతది అంతది అని చెప్పటానికి వీలుకాదు. ఎక్కడ భూమి, ఎక్కడ చంద్రమండలము, భూమినుంచి చంద్రమండలమునకు ప్రయాణము చేసే శక్తిసామర్థ్యములు ఎక్కడనుంచి వచ్చాయి? ఇది తన మేధాశక్తియే! విజ్ఞానశక్తియే! అయితే ఈ శక్తి అందరికీ ఉన్నదా? లేదు. ఆ శక్తి కొంతమందికి మాత్రమే గోచరిస్తుంది. కొంతమందిచేతిలో జపమాలలుంటాయి. ఆ జపమాలలోని దారము పైకి కనిపించదు. అయితే దారములేక మణులు ఉండటానికి వీలుకాదు. కానీ ఒకప్పటికి మాలలో ఈ దారము కనిపిస్తుంది.

## హృదయమును పవిత్రము గావించుకోవాలంటే సేవ చేయాలి

పరిశుద్ధమైన హృదయమునందుమాత్రమే పవిత్రమైన దివ్యభావము మనకు గోచరిస్తుంది. కనుక హృదయము పవిత్రము గావించుకోవాలంటే సేవ చేయాలి. కనుకనే వేదాంతము 'చిత్తస్య శుద్ధయే కర్మః' అనింది. పవిత్రమైన కర్మలాచరించినప్పుడు చిత్తశుద్ధి ఏర్పడుతుంది. చిత్తశుద్ధి ఏర్పడినప్పుడు జ్ఞానశుద్ధి కలుగుతుంది. జ్ఞానశుద్ధి కలిగినప్పుడు 'జ్ఞానాదేవతు కైవల్యం'. కనుక, సేవలు చేయాలి. సేవలు ఎవరికోసం చేస్తున్నాం? నీవు సేవలు చేయకపోతే లోకమునకు ఏమీ నష్టములేదు. నేను సేవచేసి ఉద్ధారము చేస్తున్నానని

sri sathyasai vahanamrutam

భావించరాదు. నీ సేవ నీ నిమిత్తమే! భవిష్యత్తులో ఈ సేవ ఏనాటికైనా ఫలితమునందిస్తుంది. ఎవరికి చేసినా భగవంతునికి సేవ చేసినట్లుగా భావించు. సర్వభూతాంతరాత్మ పరమాత్మ, 'ఈశావాస్య మిదం జగత్', 'ఈశ్వరస్సర్వభూతానాం'. కనుక, 'ఎవరికి సేవ చేసినా దైవమునకు సేవ చేస్తున్నాను', అని అనుకో! దేహముతో చేయుటకు శక్తి లేకపోవచ్చు. ఎవరైనా బాధపడుతుంటే 'అయ్యో! పాపం! యితను బాధపడుతున్నాడే' అని జాలిగుండెతో చింతిస్తే అదికూడా సేవయే! ఈనాడు దేశము చాలా అయోమయస్థితిలోపల అస్తవ్యస్తముగా మారిపోతున్నది. ఎక్కడ చూచినా కలహములు, కల్లోలములే! ఎక్కడ చూచినా భయంకరమైన వార్తలు, చర్యలు. ఏ నిమిషములో ఎప్పుడు ఎక్కడ ఏమి సంభవిస్తుందో తెలుసుకోటానికి కష్టము. అలాంటి పరిస్థితులలో మనం ఏవిధంగా మెలగాలి? దీనికి మూలకారణము ఏమిటి? తన హృదయములో దయ క్షీణించిపోవటమే మూలకారణము. మనం 'హృత్ దయ' అనుకుంటున్నాంగానీ దయలేదు. కనుక mankind శూన్యమై పోయింది, man ఉన్నాడుగానీ kindness లేదు. ఆ kindness లేక ఆకారమానవుడేగానీ ఆచారమానవుడు కాడు.

**మనం ఏ గ్రామంలో సేవకు వెళ్ళినా మొట్టమొదట భగవన్నామముతో అక్కడ కాలు పెట్టాలి**

మన పేరుకు తగినట్లుగా మనం ప్రవర్తించాలి, kind గా మనం ప్రవర్తించాలి. మానసికంగా, శారీరకంగా వాక్కుద్వారా మనము ఈ kindness నిరూపించాలి. దీనినే వేదాంతమందు త్రికరణశుద్ధి అన్నారు. అతనే man. The proper study of mankind is man. Thoughts, words, action మూడు ఒకటి కావాలి. మనం ఏ గ్రామము పోయినా మొట్టమొదట భగవన్నామముతో అందులో కాలుపెట్టాలి. నామముతో ఆ గ్రామములో మనం ప్రవేశించినప్పుడు ఆ గ్రామమంతా నామరూపాన్ని పొందిపోతుంది. పల్లె ప్రజలు మనలను అనుసరిస్తూ వస్తారు. ఈనాడు యిట్టి పవిత్రమైన చర్యలకు కంకణము కట్టుకోగలిగినవారు యువకులు. ఏ యువకులచేత ఈనాటి సమాజము అల్లకల్లోలముగా మారిందో ఆ యువకులే ఈ ప్రపంచమునకు శాంతి భద్రతలు చేకూర్చటానికి తగిన సమర్థులు.

srisathyasaivachanamrutam

## తల్లితండ్రులను గౌరవించినప్పుడే జగత్తును గౌరవించినవారమవుతాము

మంచికైనా చెడ్డకైనా యువకులు గొప్పవారు. కానీ సంగదోషముతో చెడ్డగా మారుతున్నారు. సత్సంగములో చేరాలి. ఇప్పుడు చూడండి, హైదరాబాదునుండి యువకులు బయలుదేరారు. ఒక వారమునుండి ఒక్కొక్క పల్లెయందు సేవలు చేయటము, నగరసంకీర్తన చేయటము, డాక్టర్సు పరీక్షలు చేయటము, వారికి తిండి తీర్థాదులు పెట్టటం ఈ విధంగా సేవలు చేస్తూ వచ్చారు. ఇలాంటి విద్యార్థులనుచూస్తే ఎలాంటి ప్రజలైనా పాల్గొంటారు. చదువుకున్నవారే ఈ పని చేస్తున్నారే మనంకూడా చేద్దాం అనే ఉత్సాహము వారిలో ఆరంభిస్తుంది. చదువు అనగా ఒక డ్రస్సుతో, ఠీవిగా ఆహంకారముగా కనిపించటంకాదు.

**విద్య యొసగును వినయంబు**
**వినయమునను కల్గు పాత్రత**
**పాత్రతవలన ధనము**
**ధనమువలన ధర్మంబు**
**దానివల్లను ఐహిక ఆముష్మికముల పొందు నరుడు.**

అప్పుడే మనకు గౌరవము వస్తుంది. విద్యార్థులని సూటుబూటు వేసుకొని యిష్టము వచ్చినట్లు ప్రవర్తిస్తే అహంకారి అనుకుంటారు. అదికాదు, మన విద్యయొక్క విలువ. వినయమే విలువ. అప్పుడే తగిన గౌరవము వస్తుంది. భారతదేశము మొట్టమొదటనుండి ఈ విధమైన వినయముచేతనే చాలా అభివృద్ధి పొందింది. మొట్టమొదట Humanity. అనేక పర్యాయములు చెప్పాను, HINDU అనే పదము గురించి. H-Humanity, ఆ Humanity అభివృద్ధి గావించిన తరువాత I-Individuality, తరువాత N-Nationality, D-Divinity, U-Unity. ఈ పంచ ప్రాణములే భారతీయుల ప్రధాన సూత్రములు. ఇలాంటి పవిత్ర చరిత్ర పొందినది భారతదేశము. ఇలాంటి పవిత్రతను మనయందే ఉంచుకొని మనం యితరులకు దాసులు కావటం ఎందుకు? సన్మార్గములో మనం ప్రవేశపెట్టాలి. సక్రమమైనరీతిగా మనం అనుభవించాలి. పదిమందికి మనం అందించాలి. ఇలాంటి విద్యార్థులు ఈనాడు వికృతి

sri sathyasai vachanamrutam

మార్గముపొంది అన్నీ విరుద్ధమైన భావాలే పెంచుకుంటున్నారు. ప్రాచీనకాలములో మన భారతదేశమందు రెండే రెండు 'సత్యంవద, ధర్మంచర'. ఇవి ఎక్కడనుండి ప్రారంభమవుతుంది? మాతృదేవోభవ, పితృదేవోభవ ఈ యిరువురిద్వారానే ప్రారంభమవుతోంది. మన ప్రత్యక్షదైవము తల్లితండ్రులే! తల్లిదండ్రులను గౌరవించినప్పుడే జగత్తును గౌరవించిన వారమవుతాము. బయట సేవలు చేస్తూ ఇంట్లో తల్లిదండ్రులను గౌరవించకుండాపోతే ఏమి గౌరవము? తెలుగులో చెబుతారు, 'ఇల్లు గెల్చి రచ్చ గెలవ'మంటారు. యింటిలో మొట్టమొదట తల్లిదండ్రులను గౌరవించు. ఎందుకనగా నీ బ్లడ్డు, హెడ్డు, దుడ్డు అన్నీ నీ తల్లిదండ్రుల గిఫ్ట్. అట్టి తల్లిదండ్రులనే నీవు గౌరవించనప్పుడు నీవు ఎవరిని గౌరవించగలవు? మొట్టమొదట ఈ అభ్యాసము అభివృద్ధిగావించుకోవాలి.

**అహంకారముండినంతవరకు ఆత్మతత్త్వము అర్థము కాదు**

విద్యార్థులారా! మీరు ఎంతటి గొప్పవారైనా, ఎంతటి విద్యావంతులైనా, ఎంత శ్రీమంతులైనా, ఎంత ఉన్నత పదవిపొందినా సేవలో మీరు పాల్గొనాలి. అప్పుడే అహంకారమనే మచ్చలేకుండా పోతుంది. అహంకారము ఉండినంతవరకు ఆత్మతత్త్వము ఏమాత్రము అర్థము కాదు. ఎవరైనా సరే! ఈ అహంకారమమకారములు రెండూ త్యజించాలి. 'నేను' అనేది అహంకారము, 'నాది' అనేది మమకారము. నేను అహంకారముగానీ, ఎవరు నేను? దేహమా నేను? మనసా నేను? బుద్ధా నేను? అంతఃకరణా నేను? ఎవరు నేను? యిది ఏదీ నీవు కాదు. మనస్సు, బుద్ధి, అంతఃకరణ, యివన్నీ instruments. నీవే దీనికి master. అదే ఆత్మ. 'నేను' అనేది ఆత్మయే! ఆత్మకు అహంకారమనేది లేదు. నిరహంకారి, నిర్మలము, నిశ్చలము, నిస్స్వార్థము, నిర్మలమైన ప్రేమ; అదియే 'నేను'. అట్టి నీవు యింకొక శాంతిని ఆశించటం హాస్యాస్పదం. You are the Embodiment of Peace. ఇంకో Peace నీకు ఎందుకు కావాలి? ప్రపంచములో ఎక్కడకు పోయినా pieces. There is no peace. You are the Embodiment of Truth. నీవే సత్యము. ఇక నీవు సత్యముకొరకు అన్వేషణ ఎందుకు జరపాలి? నీవే పరమాత్మ. You are GOD. యింకో GOD కోసం ఎందుకు ప్రయత్నం చేయాలి? సర్వము మనయందే ఉంటున్నది. ఆ సత్యమును మనం

sri sathyasai vachanamrutam

గుర్తించుకున్న తరువాత అహంకారమునకు అవకాశమేలేదు. మొట్టమొదట దైవభావము మన హృదయములో ఆవిర్భవించాలి. వ్యాసుడు 18 పురాణములు వ్రాసాడు. ఒక్కొక్క గ్రంథము చాలా పెద్దది. Pillow మాదిరి ఉంటుంటాది. ఇన్ని గ్రంథాలు చదివే ఓపిక ఎవరికి? ఓపిక ఉండినా కాలము ఎక్కడుంది? పాపము, ఈ రోజులలో జనానికి భుజించటానికికూడా టైము ఉండటంలేదు. అలాంటి పరిస్థితులలో యింత పెద్ద గ్రంథములు ఏవిధంగా చదవటం వీలవుతుంది? అందువల్లనే సులభంగా చేసి 18 పురాణముల సారాంశాన్ని రెండు పదములు 'Help ever hurt never' అనే ఒక సూత్రముగా బోధించాడు. నీవు help చేయటానికి వీలు లేకపోతే నోరు మూసుకొని కూర్చో, hurt చేయకు. అదే పెద్ద ఉపకారము. మనం చేతనైనంతవరకు తోటి మానవులకు సహాయము చేస్తూ రావాలి. అయితే మాటలు కఠినంగా ఉంటుండకూడదు. సత్యమైనప్పటికి మృదుమధురముగా ఉంటుండాలి. 'అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియ హితంచ యత్'. Smooth గా sweet గా ఉంటుండాలి. అప్పుడే హృదయానికి, హృదయానికి సన్నిహిత సంబంధబాంధవ్యము ఏర్పడుతుంది. మాటలలో మాధుర్యము రావాలి. హృదయములో ప్రేమ నింపుకోవాలి. మన కన్నులలో అమృతముగా ఉండాలి. మన దృష్టి పవిత్రమైనదిగా ఉండాలి. మన మాటలు తీయనివిగా ఉండాలి. హృదయము మధురంగా ఉండాలి. అప్పుడు లోకమే మన హస్తములో యిమిడిపోతుంది. ఇలాంటి నిత్యమైన, సత్యమైన భావాలు నిత్యజీవితములో ఉపయోగపెట్టినప్పుడు మన జీవితము ఎంత కీర్తిని పొందుతుంది? మొట్టమొదట సాధించవలసినది యిదే!

**సత్యము, కీర్తి యీ రెండే శాశ్వతంగా ఉండేవి**

> **అస్థిరం జీవనం లోకే అస్థిరం యౌవనం ధనమ్**
> **అస్థిరం దారాపుత్రాది ధర్మకీర్తిద్వయం స్థిరమ్.**

ఈ లోకములో మన జీవితము అస్థిరమైనది. యవ్వనం ఎంతకాలం? కదలిపోయే మేఘమువలె ఒక్క క్షణములో మారిపోతుంది. అన్నింటికంటె సులభంగా మారిపోయేది యవ్వనమే! మధ్యలో వచ్చి మధ్యలో పోయేది యవ్వనం. సత్యం, కీర్తి యివి రెండే మనకు

sri sathyasai vahini amrutam

శాశ్వతంగా ఉండేవి. ఏమైనా రానీ, పోనీ! ప్రపంచమే వచ్చి పోతుంటుంది. యివన్నీ సత్యముగా నిల్చినాయా? ఈ ప్రపంచము పేరేమిటి? 'జగత్తు' అన్నారు. ఏమిటి దీని అర్థము? రావటం, పోవటమే! ఈ జగత్తే వచ్చి పోతుంటే మన ధనకనకవస్తువాహనాదులు ఎంతవరకు నిలుస్తున్నాయి? ఎంతవరకు పోతున్నాయి? మన యవ్వనం ఎంతలో వస్తుంది, ఎంతలో పోతుంది? దానికి యింత అహంకార పడటం ఎందుకు? అలా చేస్తే మనకు మనం అపకీర్తి తెచ్చుకున్నవారమౌతాము. యవ్వనంలోపల చాలా వినయంగా ఉంటుండాలి. అదే నిజమైన కీర్తి. శంకరాచార్యులు 32 సం॥లోనే పోయాడు. చిన్న వయస్సు. ఎంత మధురంగా, ఎంత పవిత్రంగా ఉంటూ ఎలాంటి పరిస్థితియందైనా చాలా పరిశుద్ధమైన భావంతో జీవితం గడుపుతూ వచ్చాడు. కనుక, అతని పేరు, ప్రతిష్టలు శాశ్వతంగా నిలచిపోయాయి. అన్ని శాస్త్రములు పఠించాడు. అన్ని వేదములు వల్లించాడు. కట్టకడపటికి 'ఏకంసత్ విప్రాః బహుధా వదంతి', ఉన్నది ఒక్కడే దైవము! అని ఏకాత్మభావమనే అద్వైతభావమునే బోధిస్తూవచ్చాడు. 'ఒరే! నాయనా! ఎందుకీ భేదము? నీవు వేరు, వాడు వేరు, వీడు వేరు, అనుకుంటున్నావు. కాదు, కాదు. దేహములు భిన్నంగా ఉంటున్నాయి. అందరియందున్న పంచప్రాణములు ఒక్కటే! నాలోనున్న పంచప్రాణములే నీలో ఉన్నాయి. ఇదియే నిజమైన అద్వైతము' అని బోధించాడు. ఈ పంచప్రాణములు సర్వులయందు ఉంటున్నాయి. అతనిలో లేని ప్రాణము నీలో ఏమైనా ఎక్కువగా ఉందా? శారీరకసంబంధమైన భేదములు అనేకంగా ఉండవచ్చును. అధికారస్థాయిలు వేరు, వేరుగా ఉండవచ్చును. కానీ పంచప్రాణములు ఒక్కటే! ఈ ఏకత్వమును గుర్తించే అద్వైతమును ప్రబోధిస్తూ వచ్చాడు. కనుక Unity in diversity. దానిని మనం ఈనాడు గ్రహించాలి. అందరు భగవత్స్వరూపులే! ఒకడు భక్తుడు, ఒకడు గురువు అనేది లేదు. ప్రాకృతమైన మార్గములో గురువు, శిష్యులని భావిస్తున్నారు. ఇది ప్రవృత్తి లక్షణము. కానీ అందరూ ఏకమైనది నివృత్తి లక్షణము. దైవము నీకంటే ప్రత్యేకముగా వేరు లేదు. నీవే దైవము. దేహాభిమానము ఉంచుకోటంచేత మీరు మానవుడనుకుంటున్నారు. దేహాభిమానం దూరం చేయి, ఉన్నది ఒక్కటే! కనుక, దైవభావము పెంచుకోవాలి, దేహాభిమానము త్యజించాలి. సర్వులకు సేవ చేయాలి. సేవ చేస్తున్నప్పుడే ఈ విశాలభావము మనలో

srisathyasaivachanamrutam

అభివృద్ధి అవుతుంది.

**శరీరమునకు నిజమై శక్తి సేవద్వారా లభిస్తుంది**

విద్యార్థులారా! ఏదో యీనాడు మనం సేవ చేసినామని చెప్పుకోకుండా జీవితమంతా అవకాశం చిక్కినప్పుడంతా ఈ సేవలో పాల్గొనాలని హైదరాబాద్ పిల్లలకు చెబుతున్నాను. మీరు పొద్దుట భోజనం చేస్తున్నారు. రాత్రి తిరిగి భోజనం చేస్తున్నారు. ఇక టిఫిన్ తింటున్నారు. ఒక్కతూరే తింటున్నారా? అదే విధముగా జీవితములో ఒక్కతూరి చేయటంకాదు. దేహానికి ఏవిధంగా ఆహారమునందిస్తున్నామో జీవితానికి పొద్దున్న, మధ్యాహ్నం, సాయంకాలం యీ సేవ అనే ఆహారమునందించాలి. సేవయే దీని ఆహారము. నిజమైన శక్తి మనకు ఆ సేవద్వారా లభిస్తుంది. ఎప్పుడు చూచినా పట్టణములో కాదు, పల్లెలో కాదు, దారిలో కాదు, మార్కెట్టులో కాదు, ఎక్కడైనా సరే, నీ సేవ అవసరము వచ్చినప్పుడు నడుము వంచి పనిచేయి. నీకు తోడులేకపోయినా ఒక్కడే చేయి. పదిమంది చేరి వస్తారు. ఎవరైనా సహాయము చేస్తారు. ఈ విధమైన సేవలు ప్రతి యువకుడు చేయటము చాలా అవసరము. ప్రాచీనకాలమునుండి యిట్టి పవిత్రమైన భావములు ప్రబోధించే నాయకుడు లేకపోవటంచేత భారతదేశము యింత దుర్గతికి పోయింది. పిల్లలు ఆనాటినుండి యీనాటివరకు త్యాగమునకు సిద్ధముగానే ఉన్నారు. పెద్దలు దీనికి సరైన మార్గదర్శకము వహించలేకపోవటం, దీనికి కారణము. పెద్దలదే యీ తప్పంతాకూడను, పిల్లలది కాదు. ఈనాటినుండి మీరు యీ సేవలు చేస్తూ మీ బిడ్డలకు, మీ పిల్లలకు, మీ మనుమలకు, మీ మనుమరాళ్లకు యిలాంటి ఆదర్శమునందిస్తూ రావాలి. 'మా తాతగారు అంత సేవ చేశారు' అని మీ మనుమలుకూడా అందులో ప్రవేశిస్తారు. నీవు నీ బిడ్డలకు అందించవలసిన ఆస్తిపాస్తులు యిండ్లు, వాకిళ్లు కాదు. పవిత్రమైన కీర్తిని వారికందించాలి. నీవు చేసిన మంచిపనుల కీర్తి వారికి అందించాలి. అదియే శాశ్వతమైన ధనము. మిగిలిన ధనమంతా కదలిపోయే మేఘములే! ఏదైనా శాశ్వతముకాదు. అన్నీ అశాశ్వతమే! కానీ, కీర్తి ఒక్కటే శాశ్వతము. ఈ సత్యము ఒక్కటే శాశ్వతము. కనుక, ఈనాడు సత్యమార్గములో ప్రవేశించి దైవ పూజలేకపోయినా పరవాలేదు కానీ, పరులకు సేవ చేయండి.

srisathyasaivachanamrutam

### జీవుడిని బాధించి దేవుడిని పూజించడం సరికాదు

కోతులు మన యింటిపైకి వస్తే రాయి తీసుకొని కొడతాము. కఱ్ఱ తీసుకుంటాము. జీవముతోనున్న కోతి మన యింటిపైకి వచ్చినప్పుడు దానిని కొట్టి తరిమి వేస్తాము. ప్రాణములేని కోతి రూపము బజార్లో గుడికట్టి పెడితే దానికి కొబ్బరికాయ కొట్టి మొక్కుతాము. జీవులను బాధిస్తున్నాము, రాళ్లను పూజిస్తున్నాము. ఇదా సత్యము? జడమైన దానిని పూజించే బదులు చైతన్యముతోనుండిన దానిని పూజించు. మన యింటిలో నుండిన పశువును కొడతాము. కానీ అదే కృష్ణుని దగ్గర గోవును పూజించి నమస్కారము చేస్తాము. పాము పోతుంటే తరిమి తరిమి కొట్టి వేస్తాము. అదే సర్పము ఈశ్వరునికి ఆభరణముగా తయారైతే మొక్కుతాము. ఈ బలహీనతే మొట్టమొదటనుండి భారతదేశములో వచ్చింది. జీవులను పూజించాలి, ఏ జీవి అయినా సరే! కానీ, ఈనాడు జీవులను బాధిస్తున్నారు. దేవుని పూజిస్తున్నారు. ఈ పూజలు ఏమాత్రము ఫలితము నివ్వవు. జీవులను పూజించినప్పుడే దేవునికి ప్రీతి అవుతుంది. ఎందుకనగా ప్రతి జీవియందు తాను ఉంటున్నాడు. కనుక, జీవులను బాధించకండి. జీవుడిని బాధించి దేవుని ప్రేమించినంత మాత్రమున మనకు ప్రేమ లభ్యము కాదు. దేవుని పూజించండి, జీవులనుకూడా పూజించండి. జీవుడే దేవుడు, దేవుడే జీవుడు. ఆ విధమైన ఏకత్వమును ఈనాటినుంచి మన హృదయములోపల పెంచుకోవాలి. చాలా మంచి వయస్సు. ఇప్పుడే అటుపడినా యిటుపడినా తబ్బిబ్బైపోతుంది. చాలా narrow path పై మీరు నడుస్తున్నారిప్పుడు. ఇటుపడినా సముద్రములో పడతావు, అటుపడినా సముద్రములో పడతావు. జాగ్రత్తగా నడవాలి యిక్కడ. ఎందుకంటే యీ వయస్సు చాలా పవిత్రమైనది. యిప్పుడు చెడితివా జీవితమంతా చెడిపోతావు. ఈ వయస్సులో బాగుపడితివా జీవితమంతా బాగుపడతావు. కనుక యీనాడు కాపాడుకోవలసినది దేశాన్నికాదు; మీ సత్యమును మీరు కాపాడుకోవాలి. మీ ప్రేమను మీరు కాపాడుకోవాలి. మీ ప్రేమ, మీ సత్యమే దేశాన్ని కాపాడుతుంది.

విద్యార్థులారా! యువకులారా! మీరందరు దేశాన్ని కాపాడే నిమిత్తమై త్యాగము చేసి మూర్ఖంగా బయలుదేరకండి! మీలోనున్న సత్యధర్మాలను మీరు కాపాడుకోండి!

మొట్టమొదట సత్యము, ధర్మము. ఈ రెండింటిని మీరు కాపాడితే 'ధర్మోరక్షతి రక్షితః'. మీరు చదువుకొని సంపాయించుకొని ఉన్నతస్థాయికి పోవాలని ఆశిస్తున్నారు. కలిమి, బలిమి, చెలిమి యివికాదు మనము సాధించవలసినవి. కీర్తి, ప్రేమ, సహనము, సానుభూతి వీటిని మనం సాధించాలి. ఈనాడు man అంటే morality యే కనిపించటంలేదు. కనుక morality నిజమైన ప్రాణము. ఆ ప్రాణమును దైవప్రేమచేతనే కాపాడుకోవాలి. ఈ morality అనే వృక్షమునకు దైవప్రేమయే జలము. అటువంటి ప్రేమతత్వము మనం పెంచుకోవాలి.

**(తేదీ 29-09-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam